చక్రవర్తి మాసపత్రిక కథల పోటీలో ఉత్తమకథగా బహుమతి పొందిన కథ

# రుక్మిణీ కల్యాణం



**ఆ**వేళ నేను మా వెంకట్రావు ఇంటికి ఎందుకెళ్ళేనో సరిగ్గా గుర్తులేదు గాని నేను వెళ్ళేటప్పటికి రుక్మిణి ఏదో పుస్తకం చదువుతోంది ముందు గదిలో కూర్చుని.

ఆ చదవడం మామూలుగా చదివితే నాకనుమానం రాకపోనుగాని, అంతక్రితమే అక్షరమాల పూర్తిచేసిన పిల్లాడు వాక్యాల్ని కూడదీసుకుని చదివినట్టు చదువుతోంటే "ఏమిటమ్మాయ్ చదువుతున్నావ్?" అనడిగాను.

నా దగ్గర కొద్దోగొప్పో చనువున్నా సిగ్గుపడిపోయి లేచి నుంచుంది వంకర్లుపోతూ.

"ఏం పుస్తకమమ్మా అదీ" అంటూ చెయ్యి చాపాను, అసలే పుస్తకాల పురుగునేమో కాస్త కుతూహలం హెచ్చి. పుస్తకం అందించి లోపలికి తుర్రుమంది రుక్మిణి.

తీరా చూద్దునుకదా అది పద్యాల్లో వున్న రుక్మిణీ కల్యాణం!

ఇంతలో నా రాకని రుక్మిణి చెప్పినట్లుంది వెంకట్రావు వచ్చాడు గదిలోంచి ఆవులిస్తూ. నిద్రలేచి వస్తున్నట్టు వాడి ముఖమే చెబుతోంది – ముఖం మీద గుద్ది మరీ!

"ఇప్పుడు నిద్రేవిట్రా నీ మొహం!" అన్నాను.

"కాస్త బద్ధకంగా వుంటేనూ ఇంతక్రితమే నడుం వాల్చాన్లే. ఇదిగో ఏమేవ్ – మన ప్రసాదం వచ్చాడు కాస్త టీ పెడుదూ! టీకీ వాడి ప్రాణానికీ లంకె కదా!"

"నా గురించి నువ్వు కొత్తగా మా చెల్లెలి దగ్గర కామెంట్ చెయ్యక్కర్లేదుగాని నీకసలు బుద్ధుందట్రా?"

"మేఘంలేని వర్షంలా ఇదేం దాడిరా బాబూ వచ్చీ రాగానే"

"లేకపోతే ఈ పుస్తకం చూడు. నువ్వు గ్రాడ్యుయేట్‌విగా, చదివి కాస్త అర్థం చెప్పు."

"మనం తెలుగులో 35 పెర్సంట్ గాళ్ళంరా బ్రదర్!"

"మరి నీ కూతురు?"

"అదీ అంతే అయ్యుంటుంది. లేకపోతే ఇంకా తక్కువేనేమో. ఇంటరేకదా చదువుతా!"

"మరా ముక్క తెలిసుండి కూడా పద్యాల్లో వున్న రుక్మిణీ కల్యాణం చదవమన్నావేంరా. ఏ వచనంలో వున్న  పుస్తకమో తెచ్చిస్తే రెండు ముక్కలర్థమయ్యేవిగా. ఇంగ్లీషులో రెండు వాక్యాలు రాయలేని వాళ్ళకి మిల్టన్ గురించీ షేక్స్పియర్ గురించీ చెబుతున్నాయ్ మన యూనివర్సిటీలు. నువ్వూ అలాగే చేస్తే ఎలారా?"

"నీ వాదన రైటేరా కానీ..."

"వచన పుస్తకం దొరకలేదంటావ్. అందుకే లైబ్రరీకి రోజూ రావడం అలావాటు చేసుకోరా కనీసం ఈ వయసులోనన్నా అంటే, రిటైరయ్యాక చూద్దాంలే అంటున్నావ్. ఇంక నేనేం చెప్పేది ఆవాలూ జీలకర్రా! అయినా రుక్మిణీ కళ్యాణం కన్నా మంచి పుస్తకం దొరకలేదుట్రా తెలుగులో?"

"నువ్వు మరీ అన్యాయంగా మాట్లాడేస్తున్నావురా బాబూ. అసలు నేనా పుస్తకం చదవ మన్లేదురా దేవుడా. అది మా హోమ్ డిపార్ట్‌మెంటు జారీ చేసిన అత్యవసర ఆర్డినెన్స్. మనం

సింపుల్‌గా రబ్బర్ స్టాంపు వేశామంతే.”

“నేనే చదవమన్నాను అన్నయ్యగారూ. రుక్మిణీ కల్యాణం చదివితే త్వరగా కళ్యాణ ఘడియ వస్తుందంటారుకదాన్చెప్పి – ఖాళీగానే వుంటున్నావుగా, చదవ్వే అన్నాను” టీ కప్పులు తెచ్చి టీపాయ్‌మీద పెడుతూ అంది మా వెంకట్రావు భార్య.

నిజం చెప్పొద్దూ నాకు నవ్వొచ్చిందా మాటలకి. అదే నిజమైతే రుక్మిణీ కల్యాణం పుస్తకాన్నైనా కొన్లేరా ఈ దేశంలోని ఆడపిల్లల తండ్రులన్పించింది. ఇంకప్పుడు ఆడపిల్ల పెళ్లి ఒక సమస్యే అవ్వదుగా!

కాని వాళ్ళా మానసిక స్థితికి రావడం వెనుకనున్న కారణాలు నాకు తెలుసు కనుక జాలికూడా వేసింది. ఇప్పుడేమిటి దాదాపు సంవత్సరంన్నర నుంచి మా వెంకట్రావూ నేనూ కూడా సంబంధాల కోసం వెదుకుతూనే వున్నాం. అక్కడికీ పెళ్లిళ్ళ పేరయ్యకి యాభై రూపాయలు చదివించుకుని ఓ పది సంబంధాల ఎడ్రస్సులు సేకరించి అందరిండ్లకీ వెళ్ళి చూశాం గాని ఒక్కటీ కుదర్లేదు. ఒకటి శాఖ వేరైతే ఇంకో చోట గోత్రాలొకటై పోయాయ్. ఇక ఋషుల గోల ఎప్పుడూ వున్నదేగా. అన్నీ కలిసొచ్చాయనుకుంటే కట్నాల దగ్గర సగానికి సగం తేడాలొచ్చాయ్. ఇంకెలా చచ్చేది?!

మొన్నామధ్యేదో వూరి సంబంధం చెప్పేరుగా అన్నయ్యగారూ ఏమైనా కనుక్కున్నారా” గుమ్మం అవతల నిలబడి అందావిడ మళ్ళీ.

“ఉత్తరం రాశానమ్మా జవాబింకా రాలేదు. మళ్ళీ ఇంకోటి రాస్తాన్లే”

“ఏవిటో అన్నయ్యగారూ, పిల్లమాత్రం ఎదిగి కూర్చుంది. కళ్యాణ ఘడియేమో రోజు రోజుకి వెనక్కెళ్తోంది. దీన్తో ఇంటర్ చదివినమ్మాయి నిన్ననే పురుడికి పుట్టింటి కొచ్చింది. మనమ్మాయి పుట్టిన రెండ్రోజులకి పుట్టిన ఎదురింటి వారమ్మాయి అప్పుడే పిల్లల పుట్టకుండా ఆపరేషన్ చేయించేసుకుంది. మరేమో మా...”

ఆవిడకి మధ్యలో అడ్డొస్తూ నవ్వుతూ అన్నాను “ఒరే వెంకట్రావ్. నువ్వు ఇంట్లోని ఆడవాళ్ళని హోమ్ డిపార్ట్‌మెంట్ అంటావుగానీ అసలు ఎక్సటర్నల్ ఎఫైర్స్ డిపార్ట్‌మెంట్ అనాల్రా”

వాడూ ఆవిడా కూడా నాతో శృతి కలిపారు.

ఆ తర్వాత అయిదారు నెలలో లేక అంతకంటే ఎక్కువేనేమో కూడా – మా వెంకట్రావింటికెళ్ళడం పడింది కాదు. ఆఫీసు ఇన్స్‌పెక్షన్‌తో, ఆ తర్వాత నాకు ట్రాన్స్‌ఫర్ రావడంతో దాన్ని కేన్సిల్ చేసుకోడానికి హైదరాబాదు చక్కర్లు కొట్టడానికి సరిపోయిందా కాలమంతా!

అనుకోకుండా ఓ రోజున సినిమా హాల్లో కన్పించింది రుక్మిణి.

అసలు నేను వెళ్ళేప్పటికే సినిమా బిగినైపోయింది. వెనక సీట్లేమీ ఖాళీ లేకపోవడంతో ముందుకెళ్ళి కూర్చోక తప్పింది కాదు. మా వెనక వరసకి వెనక వరస మొదట్లో కూర్చున్న ఓ

ఇద్దరు సినిమా చూట్టం మానేసి ఒకటే కబుర్లు చెప్పుకోవడం, నవ్వుకోవడం నాకు చాలా విసుగునే తెప్పించింది. ఒకళ్లిద్దరు మందలించారు కూడా కాని ఎక్కువ ప్రయోజనం లేకపోయింది. క్రొత్త దంపతులేమోలే అని అప్పటికి సరిపెట్టుకొన్నా ఇంటర్వెల్‌లో వాళ్ళ ముఖాల వంక చూడకుండా వుండలేకపోయాను.

తీరా చూస్తే ఏముందీ రుక్మిణీ ఆమె ప్రక్కనో యువకుడూనూ!

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఎంతో నెమ్మదైన పిల్ల, ఇలా మరో యువకుడితో సినిమాకి రావడమే గాక సభ్యతని మించి అల్లరి చెయ్యడం నమ్మశక్యం కాని విషయమే మరి. ఒకవేళా యువకుడామె భర్తేమో అన్న ఆలోచనా వచ్చింది కాని నాకు తెలీకుండా మా వెంకట్రావు తన కూతురి పెళ్ళి చేస్తాడనడం పూర్తిగా అసత్యం. మరి అతడు...? బోయ్‌ఫ్రెండా? లేక బంధువులతనా?

అనుకోకుండా ఆమె దృష్టిలో నేను పడ్డానో లేదో అంతవరకూ నవ్వుల్ని చిందిస్తోన్న ముఖం ఒక్కసారే రక్తహీనంగా పాలిపోయింది! తల దించేసుకుంది! పాపం అదేమీ తెలీని ఆ యువకుడు కూల్‌డ్రింక్స్ తీసుకొచ్చి ఓ సీసా ఆమెకందిస్తూ ఏదో చెబుతూ నవ్వుతున్నాడు కాని ఆమెలో చైతన్యం రాలేదు మళ్ళీ! మెల్లగానే నా గురించేదో గొణిగినట్లుంది రుక్మిణి. అతడు నావేపు చూసి కుర్చీలో సర్దుకుని కూర్చున్నాడు.

సినిమా మొదలయ్యింది.

కాని వాళ్ళు మునుపట్లా మాట్లాడుకోవడం లేదు. నవ్వడమూ లేదు! బహుశా నా ఉనికి వాళ్ళకి అడ్డంకిగా తయారైందని గ్రహించేసరికి చాలా బాధనిపించింది. నీటిలో స్వేచ్ఛగా ఈదే చేప పిల్లని పట్టి గట్టుమీద పారేసినట్లూ, ప్రకృతంతా తన స్వగృహంగా విహరించే పక్షి రెక్కల్ని కత్తిరించి పంజరంలో బంధించినట్టూ అన్పించింది!

ఇక సీట్లో తిన్నగా కూర్చోలేకపోయాను. సినిమా మీదకసలు దృష్టి మళ్ళడంలేదు. ఇక లాభం లేదన్చెప్పి లేచి ఆమె దగ్గరకెళ్ళి "సినిమా కొచ్చావా" అన్నాను. అది సినిమా హాల్లో అడక్కూడని ఆసందర్భపు ప్రశ్నని నాకు తెలుసు అయినా నేను వెళ్ళిపోతున్నానని ఆమెకి చెప్పడం కోసం పలకరించానంతే.

తలూపిందామె.

"పిక్చర్ పరమబోర్‌గా వుంది. వెళ్ళిపోతున్నా. మీనాన్నని అడిగినట్లు చెప్పమ్మా" అన్చెప్పి బయటికొచ్చి హాయిగా వీస్తోన్న గాలి పీలుస్తూ, సిగరెట్టు వెలిగించి తృప్తిగా ఫీలయ్యాను. కాని అనుకోకుండా ఆమె దగ్గర వెంకట్రావు ప్రసక్తి తీసుకొచ్చేనని గుర్తొచ్చేసరికి కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాను. ఏమైనా ఆ ప్రసక్తి తీసుకురాకుండా వుండాల్సింది.

రుక్మిణి ఇలా ఓ యువకుడితో సినిమాకొచ్చిన సంగతి వెంకట్రావుకి చెప్పాలా వద్దా అన్నది తేల్చుకోలేకపోయాను. ముందు జాగ్రత్తకోసం చెప్పడం మంచిదన్పించినా అదంతా

అనవసరపు అనుమానమేమో అన్పిస్తూండటంతో ఏం చెప్పకూడదనే నిర్ణయించుకున్నాను.

ఇది జరిగిన వారం రోజులక్కాబోలు ఓ రోజున వెంకట్రావు ఆఫీసుకి ఫోన్‌చేసి అర్జంటుగా ఇంటికి రమ్మంటేనూ వురుకులు పరుగులమీద వెళ్ళాను ఏం జరిగిందో ఏమిటో అని.

ఇంట్లోంచి వెంకట్రావు భార్య కాబోలు సన్నగా ఏడుస్తోన్న ధ్వని వస్తోంది. ఇరుగు పొరుగు పదిమంది వరకూ చేరి చెవులు కొరుక్కుంటూ చేతులూ కళ్ళూ మూతులూ తిప్పుకొంటున్నారు.

రుక్మిణి ఏ ఘోరానికైనా తల పళ్ళేదు కదా?

ఆవాళామె మరొకరితో కన్పించిందన్న సంగతి వెంకట్రావుతో చెప్పి వుండివుంటే ఇవాళిలాటి పరిస్థితి ఎదురయ్యేది కాదేమోనన్న భావం ఓ క్షణంపాటు నా గుండెల్ని నిర్దాక్షిణ్యంగా నమిలేసింది.

అదురుతున్న గుండెల్తో తిన్నగా లోపలికెళ్ళాను. కాదు పరుగెత్తాను. ముందు గదిలో వెంకట్రావు అరచేతుల్లో ముఖం దాచుక్కూర్చున్నాడు. వాడ్నలా చూసేసరికి నాకూ దు:ఖం వచ్చేసింది.

"ఏరా" కుదుపుతూ అన్నాను.

"వచ్చావా–రా–" అంటూ కళ్ళు తుడుచుకుంటూ నన్ను గదిలోకి తీసుకెళ్ళి "ఓ ఘోరం జరిగిపోయిందిరా" అన్నాడు. సృష్టిలోని బాధంతా వాడి కంఠంలోనే కన్పించింది నాకు!

"ఏం జరిగిందిరా?"

"రుక్మిణి..."

"రుక్మిణి? ఏం జరిగిందో త్వరగా చెప్పరా?"

"రుక్మిణి పెళ్ళి చేసుకుందిరా"

ఆ మాటలకొక్కసారే నా గుండెలు హాయిగా నిట్టూర్చడమే కాదు కొంచెం ఆనందం లాంటిది కలిగింది కూడానూ.

"అంతేకదా!" తేలిగ్గా నిట్టూరుస్తూ అన్నాను.

"అదేవిట్రా అలా అంటావ్? రుక్మిణి ఎవర్ని చేసుకుందనుకున్నావ్?"

"ఎవర్ని?" మళ్ళీ గుండెల్లో గాభరా!

"మన శాఖకాదు మనకులం కాదు కనీసం మనకన్నా ఎక్కువ కులం వాడ్నైనా కాదు తక్కువ కులం వాణ్ని చేసుకొందిరా!"

"ఆ అబ్బాయి ఏంజేస్తున్నాట్ట!"

నా వంక అర్థంకానట్లు చూసి "ఏదో ఉద్యోగం వెలగబెడుతున్నాళ్ళే. అయితే మాత్రం కులం కులమే కదా!!" అన్నాడు.

"నిజమే రా. వాళ్ళిద్దరిదీ ఒకటే కులంరా"

పిచ్చిగా చూశాడు వెంకట్రావు.

"వాళ్ళది 'యువ' కులం"

"అయితే?"

"ఇందులో గాభరా పడి గుండెలు బాదుకోవల్సిందేంలేదు కాని తిన్నగా కూర్చుని ఆలోచించు. మనలో, మన పెద్ద తరం, అంతగా ప్రోగ్రెసివ్ థాట్స్‌ని ఇంప్రూవ్ చెయ్యలేదు. అయినా మారిన పరిస్థితుల కనుగుణంగా మనం కొంచెం ముందుకి నడిచాం. స్వాతంత్ర్యోద్యమకాలంలో మనం యువకులుగా వుండటం అందుక్కారణం కావచ్చు. కాని మనం మనకున్నంత ప్రోగ్రెసివ్ థాట్స్‌ని కూడా మన పిల్లలలో కల్గించలేకపోతున్నా వాళ్ళంతట వాళ్ళే దిద్దుకుని మనల్ని దాటి వెళ్ళిపోతున్నార్రా. అందుకు మనం సంతోషించాలి గాని ఇలా ఇదవ్వడం అనవసరం"

"నువ్వెన్నైనా చెప్పు, అది చేసినపని మంచిది కాదురా. నలుగురూ ఏమనుకుంటారో, నా పరువేం కావాలో ఆలోచించరా" కళ్ళలో నీళ్ళు పెట్టేసుకుంటూ అన్నాడు.

"లోపలేమనుకున్నా పైకి మాత్రం ఎవరూ నిన్నేమీ అనర్రా. అంటే వాళ్ళని అభివృద్ధి నిరోధకుల్లానూ వింతజంతువుల్లానూ మిగిలినవాళ్లు చూస్తారని వాళ్ళకి తెలుసు. ఎంచేతంటే ఈమాటే ఇతరులంటే వాళ్ళూ అలాగే చూస్తారు గనుక!"

"ఏమోరా నేను మాత్రం సర్ది చెప్పుకోలేకపోతున్నాను"

"రుక్మిణి ఎక్కడుంది?"

"ఆశీర్వదించమంటూ వచ్చారు. వీల్లేదంటే వెళ్ళిపోయారు. ఇన్నేళ్ళు నా ఇంట్లో నా గుండెల మీద పెరిగిన నా కూతురు నా గుండెల్లో అగ్నిపర్వతాలు పేల్చి మా పరువు ప్రతిష్ఠల్ని త్రోసి రాజని వెళ్ళిపోయిందిరా"

"ఆడపిల్లల్ని కన్నవాళ్ళు ఏదో రోజున కూతుర్ని మరో ఇంటికి సాగనంపక తప్పదు గాని వూరుకో వూరుకో" అన్చెప్పి లోపలికెళ్ళాను వెంకట్రావ్ భార్య దగ్గరికి.

ఆవిడ నన్నుచూసి బావురుమంది.

"వూరుకోమ్మా! నువ్విదివరకెప్పుడో అన్నట్టు రుక్మిణీ కల్యాణం చదవమన్నావ్. చదివింది. పెళ్ళయ్యింది. అందుకు సంతోషించాలి గానీ విచారించడం ఎందుకమ్మా?"

ఏడ్పునాపి నావంక విడ్డూరంగా చూసి "ఆ అబ్బాయిది మన కులం కాదన్నయ్య గారూ" అంది.

"నేనో మాట చెబుతాను వింటావా చెల్లాయ్."

ఏమిటన్నట్లు చూసింది.

"పెళ్ళికాని అమ్మాయిల్ని రుక్మిణీ కల్యాణం చదవమంటారు. అది చదివితే పెళ్ళెలా అవుతుందో నాకు తెలీదుకాని అందులో ఒక అంతరార్థం వుందనిపిస్తోంది. రుక్మిణీ కృష్ణుల కల్యాణం పెద్దలు చేసిన పెళ్ళికాదు. పిల్లలు తమంతట తాము చేసుకున్న ప్రేమవివాహం.

పైగా కులాంతరం కూడానూ. రుక్మిణి క్షత్రియ కన్య అయితే కృష్ణుడు యాదవ కులస్థుడు. అలాటి కల్యాణాన్ని సమర్థిస్తూ వాళ్ళని పురాణ పురుషులుగా పూజిస్తూ పిల్లల్నా ఘట్టాన్ని చదవమని చెబుతూ, మళ్ళీ వాళ్ళలాగే చేస్తే విమర్శించడం ఎంతవరకూ సమంజస మంటావమ్మాయ్"

ఆమె నావంక వెర్రిగా చూసి అంది "ఇదే మీ అమ్మాయి అయితే మీరిలాగే చెప్పేవారా అన్నయ్యగారూ?"

"అది నేనిప్పుడెలా చెప్పగలను? అలాగని నేను చేసినట్టే మీరూ చెయ్యాల్సిన పనిలేదుగా. ఇలాటి విషయాల్లో ఇతరులేం చేసివుండేవారన్నది మన కనవసరం. సమస్య ఎదురయ్యింది మనకి. గనుక మనమేం చెయ్యాలో మనమే ఆలోచించుకోవాలి. ఇక ఆలోచించి చెయ్యగలిగింది లేదు గాని అయ్యిందేదో అయ్యింది గనుక వెళ్ళి రుక్మిణీనీ అతడ్నీ తీసుకొద్దాం రా చెల్లాయ్."

"ఆ పాపిష్టి దాని ముఖం నేను చూళ్ళేనన్నయ్యగారూ. ఇప్పటికే అది చేసిన పనికి నలుగుర్లోనూ అప్రతిష్ఠ పాలయ్యాం. ఇక వాళ్ళని తీసుకొచ్చి కులభ్రష్టులం కాలేం."

వెంకట్రావు దగ్గర కెళ్ళి "పోనీ నువ్వైనా రారా వెళ్ళి తీసుకొద్దాం" అన్నాను.

"నేను రాలేన్రా. రెక్కలొచ్చిన పక్షులు పుట్టి పెరిగిన గూళ్ళు వదలి వెళ్ళిపోయి కొత్త గూళ్ళు పెట్టుకుంటాయ్ అంటూంటావుగా. రుక్మిణికి రెక్కలొచ్చాయ్ వెళ్ళిపోయింది. ఇక వెనక్కి పిలిచే ప్రసక్తిలేదు."

"ఈ ఆవేశాలూ ఈ పట్టుదలలూ ఎప్పుడూ ఇలాగే ఉండిపోవురా. కాని వాళ్ళు కొత్తగా ఏర్పరచుకున్న బంధం వుందే అది శాశ్వతంగా నిలచిపోవాల్రా. ఇవాళ కాకపోయినా మరికొన్నాళ్ళు పోయాకైన మీరు మీ పట్టుదల నుంచి దిగివచ్చి వాళ్ళని క్షమించి ఆశీర్వదిస్తారని నాకు తెలుసు. కానీ వాళ్ళు వేసిన ముందడుగు నుంచి వెనక్కి తిరక్కూడదురా. అందుకే నే వెళ్ళి వాళ్ళని ఆశీర్వదిస్తాన్రా. అది నా బాధ్యత కూడా. వస్తాన్రా"

బయటికి నడిచాను.

అప్పుడే వీధి దీపాలన్నీ ఒక్కసారే వెలిగాయ్!

* * *

**(చక్రవర్తి మాసపత్రిక డిసెంబర్ 1978)**